వాళ్ళము. నడక అంటే బహు సరదాగా వుండేది. నావ ఎక్కడం అంటే ఇప్పట్లాగా లాంచీ ఎక్కేవాళ్ళం కాదు నావ అద్దెకు తీసుకొని దాన్ని మేమే నడిపి తెడ్లువేసుకొంటూ పోయేవాళ్ళం పాడుకొంటూ ఏ లంకమీదకో ? అక్కడదిగి తెచ్చుకొన్న పులిహోరో, బొబ్బట్లో తినేసి ఇన్ని నీళ్ళు తాగేసేవాళ్ళం. ఆ రోజుల్లో కాఫీలు లేవు. తేనీళ్ళూ లేవూ.

ఈ షికార్లు వెళ్ళడం, తరువాత తరువాత నర్సాపురం వెళ్ళాకకూడా అలవాటు అయిపోయింది. ఒక్కొక్క షికారు రాకపోక కలిపి ఆరుమైళ్ళకు తక్కు వుండేది కాదు. అప్పుడప్పుడు లిఖితపూడి, సీతారాంపురం వంతెన అదీ దాటి వెళ్ళినప్పుడు రాకపోకల పొడవు 8 మైళ్లుకూడా వుండేది. మఱి నర్సాపురపు గోదావరి మీద పడవవేసుకు వెళ్ళేవాళ్ళం. బహు ఆందంగా వుండేది. తిరుగ రాజమహేంద్రవరం వచ్చాక కూడా చాలా కాలం ఈ షికార్లు మానలే! వెడుతునే వుండేవాళ్ళం. మావూరు అనగా శ్రీరంగపట్నం వెళ్ళినప్పుడు కొండ లెక్కడం పరిపాటే!

ఏవం విధంగా షికారు వెళ్ళడం అంటే ఒక ఆనందం నాకు. అది వ్యాయామం చేకూరుస్తుంది. ఉత్సాహానికి ఉత్సాహం పెంపొందిస్తుంది.

....

మా న్ సూ న్ స్పీ డ్

"పుంతలో ముసిలమ్మ" అంటే సర్వసాధారణంగా అందఱికీ అర్థమైపోతుంది మైలురాయి అని. "మాన్‌సూన్‌స్పీడ్" అంటే

ఎంతమందికి అర్థమైందో? "ఋతుపవనవేగం" అని దాని అర్థం. దానినే "పొడుపుకథల" భాషలో గుర్తించాలీఅంటే ఏమనాలో నాకు తెలియకుండావుంది. ఈ వ్యాసం ముగించేలోగా ఏదైనా కొత్త సంగతి తట్టగలదేమో చూతాం!

"ఆ వారం అంతా నాలో స్పీడ్ కాంగ్రెసుస్పీడ్" అని వెనక ఒక వ్యాసం ముగించాను. అప్పుడు చూచిన మహానగరం కలకత్తా! ఆలాంటివారమే నేను గడపిన మరొక వారమూ. నేను చూచిన మరొక మహానగరమూ కలవు. ఆ వారము 19-10-1945 మొదలు 25-10-1945 వఱకు గల ఆరున్నొక్కపూరారోజుల వారమూను ఆ నగరము మదరాసు—దక్షిణ—మహారాష్ట్ర ఇనుపదారికి. ఆదిమూలమైన మదరాసునగరము. నగరవర్ణనంకంటె నగర ప్రవేశవర్ణనం ఇప్పట్లో ఇతివృత్తమునకు సత్తువ ఇచ్చేని. ఆంధ్రుడైనవాడు మదరాసునగరం అంటే చెవి కోసుకుంటాడు. నేను ప్రవేశించిన ఆ రాత్రి మదరాసు పట్నంమీద ఆకాశాన్ని అతి నిర్మలంగా చూడగలుగుతూ పట్నంయొక్క పొడి పొడి తాౘరోడ్డంట టకటకా జట్కామీద పోగలిగానూ అన్న సంగతి తలుచుకుంటే ఇప్పటికికూడా వింత వినోదం ముప్పిరిగొనిపోతూవుంటాయి. ఆ రాత్రి "డయిరీ" ప్రకారంచూస్తే కనవచ్చేది 18-10-1945 రాత్రి 10 గంటలు. ఆకాశాన్ని చూస్తే చుక్కలూ చూడ చక్కనైన శరత్కాల ప్రప్రథమ ద్వాదశీ తరుణ చంద్రబింబమూను!

కాని 17-10-1945 సాయంకాలం రాజమహేంద్రవరంలో ఇంటివద్ద నేను మంచిచేసుకు, మెయిలు అందుకుందామనే దృష్టిని రిక్షాలో కూర్చున్నప్పటి సంగతి! చలిగాలి

ప్రారంభించింది. అప్పటికప్పుడే చినుకులు పడుతున్నాయి. ఆకాశంఅంతా మహాట్టహాసంగా మేఘావృతమై వలాహకాదులు విచ్చలవిడి విహరిస్తూ వున్నంత విహ్వాలత్వం వెల్లడిగావిస్తూ వుంది. "వెళ్ళనా మాన్నా?" అని ఒక లిప్త ఊగిసలాడి, రిక్షావాణ్ణి "నిలు నిలు లాగకు" అని ఆపి, మళ్ళీ "లాగు" అని ముదలయిచ్చి బయలుదేఱాను. "ఉత్తరాలు తడియకుండా తీసుకుపోయే మెయిలుబండిమీద మనం మాత్రం తడియకుండా పోలేమా?" అని పెద్ద నిబ్బరము తోచింది.—ఇంతకూ మదరాసుకు రాజమండ్రీకి దూరం 361 మైలు మాత్రమే! "ఒక్కరాత్రి కన్నుమూసుకుంటే తెల్లాఱేసరికి మదరాసు!" అనిపించింది. మఱిన్ని "రాజమండ్రీకి—మదరాసుకు మధ్యను తెల్లాఱని రాత్రి అంటూ వుంటుందా?" అని అనిపించింది.

చెమ్మగానున్న రోడ్డంట రిక్షా లాగబడుతూన్న కొద్దీ, తరపచిత్తడి అయినకొద్దీ, నా మనస్సులో అదేమిటో "పెసిమిసమ్" కు బదులు "ఆప్టిమిసమ్" రేకెత్తసాగింది. "గర్జలా ఉఱుముతోంది బాబూ" అని రిక్షావాడంటే "ఉఱుమనివ్వరా!" అంటూ ఉఱకవేసినట్టు సాగించాను రిక్షాను రాజమహేంద్రవరం పెద్దస్టేషనుదాకాను సకాలానికి, అనగా మెయిలువేళకు అన్నమాట.

దారిలో ఏ విధమైన విలియ వైపరీత్యము గాని, అకాల మృత్యువు గాని రాలేదు! కాని స్టేషన్ భవనంలో దిగి ఇటూ అటూ తిలకించేలో కూలీవాడు "బాబూ! మెయిలుకా?" అన్నాడు. "ఏం?" అన్నాను. "ఇంకా ప్యాసెంజరే రాంది, మెయిలూసు ఏం చెప్పను బాబూ! కూకుంటే వెయిటింగు

రూములో కూకోండి!" అన్నాడు. గడియారం వంక చూచాను. మెయిలు రావలసిన "టయ" మయింది....ఆకాశం పిడుగడ్డట్టు మెఱిసింది. కూలివానివంక నేను గ్రుడ్లుఱిమాను. వాడు తిన్నగా సామాను వెయిటింగ్ రూములో జాగ్రత్తపెట్టి "తమరు ఇక్కడ దయసేయండి! నే కనుక్కొస్తాను. తమ రొక్కరే నేటి ప్రయాణీకులు ఈ స్టేషనునుండి వెళ్ళేవారు. బాబులుకు వానా వఱదా ఆటంకాలు లేవు లాగుంది" అన్నాడు. కూలీవాండ్లలో కొందఱు కొందఱు అతి వాగుడుగాండ్లుంటారు, ఆలాంటివాళ్ళల్లో వీడొకడు అని అనుకొని వాణ్ణి సామాను చూస్తూవుండమని నేనే తిన్నగా స్టేషనుమాస్టరుగారి దగ్గఱకు వెళ్ళిపోయాను.

స్టేషన్‌మాస్టరు, దీపాల నాగమ్మను "వెలిగించరా హరికేన్ లాంతరు. కర్రెంటు పోయినట్టుంది" అని అంటున్నాడు. టెలిఫోను కొమ్ము ఎత్తి "హల్లో" అని ద్వారపూడి పిలుస్తున్నాడు. అటునుంచి జవాబు లేదు, "మెయిలు ముందా? ప్యాసెంజరు ముందా?" అని అన్నాను, నిరాశాపూరితుడై అతగాడుంటే. "ఆ సంగతే కనుక్కుందామని పిలిస్తే పలకడం లేదు ఒక స్టేషనూ. వాల్తేరునుంచి కడియందాకా ఒకే రొద ఒకే గాలీ విసురుతూన్నట్టుంది" అన్నాడు. అంటే "తూర్పు గాలా?" అన్నాను. "ఏ దిక్కూ కనబడ్డం లేదు నాకిప్పుడు" అన్నాడు అతగాడు. మఱి వొంగి వొంగి, ఇద్దఱం కలిసి సన్న చినుకు గుండా లైనమ్మటే చూచేం! లైను బాగానే వుంది బొమ్మూరు మెట్టదాకా! "బహుశా ప్యాసెంజరే ముందొచ్చేటట్టుంది" అని అంటూ తన గదిలో గణ గణ శబ్దమైతే స్టేషను మాస్టరు పరుగెత్తేడు. మరినాలో వితర్కం, "ప్యాసెంజరుమీద

పోతేనో ? ” అని. “ ఏదో బండిలో ఎక్కి కూర్చుంటేనే మెఱుగు. ఎంత వాన కురిసినా ఎంత గాలివేసినా, ఇంటికంటె గుడిపదిలం అన్నట్లు స్టేషన్‌కంటె రైలే మెఱుగనుకున్నాను. రేపటి క్కాకపోతే ఎల్లుండికైనా మదరాసు చేరకపోతామా ? అని తలపోశాను. పట్టాలు ఇనపపట్టాలు, ఎంత గాలి వేసినా ఎగిరిపోవు అని నా ధీమా !

ఎప్పుడు రెక్కి వాలిందో, ఎప్పుడు ప్యాసెంజరు వచ్చిందో, ఎప్పుడు టిక్కెట్టు నేను కొన్నానో, అంతా ఒక్క అరగంటలో జరిగింది. ప్యాసెంజరు ఎక్కగలిగాను. అది ఆగిన వెంటనే ఆట్టే తడియకుండా, పెట్టెపెట్టి తడుముకుంటూ నున్నగా మెత్తగా ఒక కంపార్టుమెంటు కనిపిస్తే “ ఇదిరా ! పరుపుల పెట్టె ” అని కూలీని కేకేస్తూ.—కూలీని పొమ్మన్నాను డబ్బు లిచ్చేసి. చీకట్లో ఒక్కణ్ణి కూర్చున్నాను. తూర్పువైపు ఆ అరకు తలుపులు వేసేసి ఉన్నాయి. జల్లు, జడి, చలి, అప్పటిమట్టుకు అనిపించలేదు. కాని “ మెయిలు దీన్ని తొక్కెయ్యదా ? ” అనే సమస్య కాళ్ళా వ్రేళ్ళా సంకెలవేసి, మనస్సును ఊగిసలాడించింది కొంతసేపు.—అంతలో ఎంజిన కూసింది. గంట మోగింది. పచ్చలాంతరు గార్డు చూపాడు. కూర్చున్నబండీ కుదుపిచ్చింది. “ అదొస్తుందో రాదో అసలు ! దీన్నెక్కడమే మంచిపని చేశాను ” అని అనిపించింది. కునుకుకోసం బిచాణా విప్పాను, మఱి చేసే పని లేక ! కిటికీలన్నీ తలుపులన్నీ మూసేశాను.

అయితే కడసారి వీడ్కోలు అదే కావచ్చునేమో అని అనుకుంటూ, రాజమహేంద్రవరం కేసి ఒకసారి చూదామని పడమటెంపు కిటికీ బిక్కు బిక్కు ఎత్తేను. రంయని పడమటి

గాలి తిరిగి అదే జల్లు! అదే జల్లు! రైలు గోదావరి స్టేషనులో నిలిచిపోయింది. నేను తలుపులన్నీ తిరుగ వేసుక బండిలో కూర్చున్నాను. "వంతెనమీద బండి నడువదేమో? నడిస్తే ఆ గాలికి పడిపోతుందేమో? కింద గోదావరి ఎంత లోతుందో?" ఇవీ నాలో నేను వేసికొన్న ప్రశ్నలు ఆపొద్దు! వేసికొని పక్కమీద పొడి జాగా చూసుకుని, ఒక్కణ్ణీ క్రిక్కిటిసి కూర్చున్నట్టు ముణిచిపెట్టుకు, ముక్కున కొనయూపిరి పెట్టుకున్న వాడిలా కిక్కురు మనకుండా కూర్చున్నాను. తపస్సు దేన్ని గురించి చేదామన్నా నాకు ఏమీ కనిపించలేదు. దేవుడే లేడనిపించింది. వంతెన ఎక్కేముందు తగిలే "ఆర్చి" మీద వుంది ఇంజన్. ఆర్చి క్రింద రోడ్డు "జి. టి. ఆర్" అనగా గ్రాండు ట్రంకురోడ్డు. తెనుగులో చెప్పాలిసి వస్తే రామేశ్వరంనుండి కలకత్తా మీదుగా కాశీ తీసుకుపోయే మహారస్తా. గ్రాండ్ట్రంకు ఎక్స్‌ప్రెస్ పొయ్యే రైలుపట్టాల దారి దగ్గర గాని దక్షిణాదికీ ఉత్తరాదికీ గ్రాండ్‌ట్రంకురోడ్డు ఎలాచూచిన చుట్టే. అది హిందూదేశం మీద మధ్యగా పోదు. కోస్తా అమ్మటే పోయి, కలకత్తాదగ్గఱ పడమటకు మళ్లుతుంది. బహుశా ఆ పోవడం పోవడం ఆ "అటకం" దాకా పోతుందనుకుంటాను. అదే తూర్పువైపు మళ్ళితే బహుశా "చిటకం" దాకా పోవచ్చు. వంగదేశంలో చిటకం, పాంచాలంలో "అటకం" మటి కటకం అసలు రస్తామీదే వుంది బరంపురానికి—కలకత్తాకు మధ్య మహానదిమీద. ఇదంతా నీ ముక్కేదిరా అంటే "అసావాదిత్యో బ్రహ్మ" అని చూపిన తీరే అని అనుకోకండి పాఠకులు. ఒంటరిగా కూర్చున్న నా ముందు ఆ తుపాను సమయాన్ని

పధ్నాలుగు భువనాలయొక్క రహదారీ మార్గాలు కనిపించినప్పుడు భారతవర్షంలోని ఈ మహారస్తాను ఏలా విస్మరింపగలను ?— ఉన్న దున్నట్టు మీ యెదుట బెట్టాను. కాని రైలుమాత్రం ఒక అంగుళం కదలలేదు. గంట కొట్టినా ఈలవేసినా, పచ్చజెండా చూపినా, ఎదర రెక్కవాల్చినా ఎన్ని చేసినా తుదకు ఇంజిన్ ఎంత గింజుకున్నా ఎదరగాలి తీవ్రతకు అలా నిలుచుండి పోయింది. తలుపు తీసినా తలుపు వేసినా ఒక్కలాగుంది చీకటి !

అంతకంటే ఎక్కడి మేఘం అక్కడ ఉక్కిరి బిక్కిరై తభీతభీ ఊడిపడ్డట్టు ఓడికగా వర్షింప దొడగింది. నా గుండెల్లో రాయిపడింది. రాయిపడింది అంటే ఉత్తరాయికాదు. అంకెలతో వున్నరాయి. ఆ అంకె ఏమనుకున్నారు ! 361 మూడువందల అరవై ఒకటి. అది గ్రాండ్‌ట్రంకు రోడ్డున అక్కడ పాతిన మైలురాయి. మద్రాసు అక్కడకు అన్ని మైళ్ళుందని చూపిస్తుంది. ఆ రాయివచ్చి నా గుండెల్లో అమాంతంగా పడినట్టయింది. ఎలా లేచివచ్చి పడింది అని అడక్కండి పాఠకులు. గంటకు 100, 150 మైళ్ళ వేగాన్ని విసరే ఝంఝకు ఏది లేచి వచ్చి ఎక్కడ పడదు ?

మర్నాడురాత్రి పదిగంటలకు మదరాసులో నేను దిగిన అనంతరం కూడా నా మనస్సులో నిలిచి "ఆ రాయి ఇంకా అక్కడ రోడ్డుమీద వుంటూ మైళ్ళు సూచిస్తుందా ? లేక అనంతాకాశంలో లీనమైపోతూ మదరాసు రాజమహేంద్రవరం మధ్యనున్న దూరాన్ని హరించివేసి వుంటుందా ?" అనే విచింతనమే! నమ్మండి ! ఋతుపవనానికి అంత వేగం వుంది. అదే నేను ఈ వ్యాసంకు మకుటంగా పేరుపెట్టిన "మాన్‌సూన్‌స్పీడ్"

అన్నా! 361 మదరాసు అని సూచించే గ్రాండ్ ట్రంక్ రోడ్డు మైలురాయి గాలికెగిరి నాగుండెల్లో పడడమే "మాన్‌సూన్‌స్పీడ్!"

పైని వ్రాసిన నా అనుభవం అంతా ప్రత్యక్ష కృత్యం! సత్యం! నిత్యం! కాని కాలమానం తిరుగుతూనే వుంది. దాని గుండెల్లో ఏ రాయీ పడ్డట్టు లేదు. తెల్లాటి 7 గంటలకు నేను తలుపులు తెఱచి చూడ్డంలో చిన గంజాం స్టేషన్ కనిపించింది. బతుకు జీవుడా! ఈ దాకా కొట్టుకొచ్చామా అన్నాను గట్టిగా ఒక్కసారి.

ఆ దాకా నన్నెఱుగని ప్రక్క అరలోని తోడిప్రయాణీకుడు తటాల్న లేచి "ఎందాకా వచ్చాం?" అన్నాడు. "చిన్న గంజాం దాకాను" అన్నాను. అతడి మణికట్టు గడియారంలో ఉదయం ఏడైనా ఆకాశం ఇంకా బూడిదరంగుగానే వుండి సద్యః సూర్యోదయం అవుతూ వున్నట్టు అనిపించింది. గాలి చినుకు ఇంకా గడబిడగానే వుంది. జీలుగు మోకొకటి స్టేషన్ ఆవల ఆరుబయట ఊగిసలాడుతూ వుంది. శివమెత్తిన దానిలా! కనిపించే ఒక కట్టడము యొక్క గోడ వొకటి నాని నాని అప్పుడే కూలిపోయింది. అయినప్పటికీ ఎంజిన కదిలింది ఏలాగైనా మదరాసు చేరి తీరాలని! మెయిలెక్కడో మా ప్యాసెంజర్ను తప్పుకు వెళ్ళిపోయిందన్నారు. మెయిలు ముందు వెళ్ళడం మంచిదే పైలట్‌బండిలా పని చేస్తుంది అన్నాను. దాని తరువాత ఇది వెళ్ళడమే సేఫ్ అన్నాను. తెల్లాటాక కబుర్లేన్నైనా చెప్పొచ్చు చూడండి. బిట్రగుంట ఆ ప్రాంతానికి వెళ్ళేసరికి మేఘాలు వట్టిపోయి పరుగెడుతూన్నట్టు కాపడింది. పరుగెడుతూన్నవి మేఘాలా సూర్యుడా?

అనే సందేహం కూడా వేసింది—మఱి మధ్యాహ్నానికి కావోలు గూడూరు చేరాం—అక్కడితో ఆ తుపానుభీభత్సం అంతమైనట్టుంది. బండీకి కొంచెం వేగం పట్టింది. క్రమక్రమంగా బేసిన్ బ్రిడ్జి చేరేసరికి అసలు వానే కురిసినట్టు లేదు. సంధ్యారాగం గడచి చక్కని చుక్కలు పొడగట్టసాగాయి ; మదరాసు చేరేలో శరత్కాల ప్రప్రథమ ద్వాదశీ తరుణచంద్రుడూ నేనూను! 18-10-1945 రాత్రి పదిగంటలైంది. ఆ సంగతి తొత్తనే పాఠకులచెవిలో ఊదేశానుగా.

మఱింకా అనుకున్నాను. "అమ్మయ్యా! తెనుగుజిల్లా లనే శనిగ్రహం వదలిపోయింది. మదరాసులో పడ్డానురా!" అని, అనుకుంటూ సువిశాల శుభ్రమైన ఆకాశాన్ని మదరాసు మీద చూచేను. మౌంట్‌రోడ్డు మాంచి మదమెక్కిన ఏనుగులా కనిపించింది. దానిమీద టకటకా మా జటక్ గుఱ్ఱం పోతూవుంటే ఎలావుంది? "విస్కీవైట్‌హార్స్" లాగుంది.

కాని మర్నాడు తెలుసుకుంటే మేము వచ్చిన రైలే నాటి ఆఖరురైలనీ, మఱి ఎక్కడిరైళ్లు అక్కడే బంద్ అయిపోయాయని పుకారు. ఇంకా లోతుగా పూడిస్తే తేలింది—"ఎమ్. ఎస్. ఎమ్. ఆర్ వాల్తేరు నుండి గూడూరుదాకా అన్నీ గండ్లేనని—మనుష్యులు తిరుగపోయేందుకు వీల్లేదని—" ఇంకా వింటే వెల్లడికావచ్చిన సంగతి—"తుపాను చెలరేగిన పొద్దుగునా చెట్లు అన్నీ కూలిపోయాయి అని–పక్షు లెన్నో చచ్చిపోయాయి అని ; పశువులన్నీ విహతమైనాయి అని,—పంటలన్నీ వినాశనమైనాయి అని.—

ఇఖ పుంతలో ముసలమ్మలను గురించిన వృత్తాంతం అడిగేదేమిటి అని అనుకున్నాను. రోడ్లకురోడ్డు గండిపడిపోయాక

రోడ్ల పొడుగుచూపే మైలు రాళ్ళుంటాయా అని అనిపించింది. అయితే ఎంతసేపూ, మనస్సులో మదరాసుకు—రాజమండ్రికి మధ్యను వున్న మైలురాళ్ళే జ్ఞాపకం వచ్చేవి. అవి ఎన్ని అని అనుకొన్నప్పుడల్లా నెల ముప్పై రోజులు లెక్కిస్తే 12 నెలల ఏడాదికీ సరిపోయే 360 రాళ్లుగా తోచి పైనొకటి మిగుల్తూ వచ్చేది. ఆ ఒక్కరాయి 17-10-1945 రేయి నా గుండెల్లో పడ్డ 361 నెంబరును మైలురాయిగా వచ్చేది.

అది ముసిలమ్మల్లో ముసిలమ్మల్లా తోచేది. "మాన్ సూన్ స్పీడ్" కు ఎగిరివచ్చి నా గుండెల్లో నిలిచివుండే ఈ మదరాసుదాకా నన్ను వెంటాడించి అని అనిపించేది. తెనుగుజిల్లాలపు-పురాతనపు రాయిగా-పునాది రాయిగా తట్టేది. ఆ ముసిలమ్మ కాలంచేసినా అనగా దాన్ని మనం మఱచిపోయి నట్టాయినా రాజమండ్రీకి మదరాసుకు మధ్య దూరమేలేదు. కాలమే లేదు. ఆ రెండూ లేనప్పుడు మదరాసే రాజమండ్రీ రాజమండ్రీనే మదరాసు.

ఈ దృష్ట్యా ఒకవారం వారం మదరాసే రాజమండ్రి అన్నట్టు తిరిగేశాను. 19-10-45 తేదీని రేడియోస్టేషనులో నా గీతికలు ప్రసారం చేశాను. 20-10-45 న అడయార్ అవల కంటూలాటిస్ బ్రిడ్జిరోడ్డే వెళ్ళా. 21-10-45 న మైలపూర్ లో కొత్తరకం బస్సు ఎక్కాను. 22-10-45 జార్జిటౌన్ హడావిడిని తిరిగాను. 23-10-45 న రాయపేటలో నిలిచాను. 24-10-45 న విజ్ఞానసమితి వీక్షించాను. 25-10-45 న పరసువాకం చేరాను. అక్కడనుంచి ఆ రాత్రికి సెంట్రల్. మర్నాడుదయం రాజమండ్రి. మొత్తం రు 35/లు వెచ్చించాను. ఆ రూ 35/లులోను రు 24/లు రానుపోను ఇంటర్ టిక్కెట్టు ఛార్జీకే.

రాజమండ్రీలో టిక్కెట్టు ఇస్తూ అంకె చూస్తినిగదా! దూరం 361 మైళ్లు. పుంతలో ముసిలమ్మమీద అంకె 361. తుపాను చెలరేగినా చెడనిదీ అంకె వొక్కటే అని అనుకొన్నాను. కాని మదరాసులో ఆ వారం నన్ను విసుగులేని త్రిప్పట త్రిప్పింది ఏ అంకె? ఏ రాయి? అంకెలేని మగరాయి! దానికోసమే నేనాదాకా తఱుముకెళ్ళిన "మాన్‌సూన్‌స్పీడ్" అని అనిపించింది.

....

ఇంగ్లీషు చదువూ ఫరంగీ వేషం

రాజమహేంద్రవరములో ప్రభుత్వమువారు కట్టించిన కట్టడాల్లో "బోధనాభ్యసన కళాశాలా" భవనం చాలా పెద్దది. అపురూపమైనది అని నా అభిప్రాయం.

1906-న ఉత్తరసర్కారుల్లో అదొక్కటే ఎనిమిదవ తరగతినుండి పదవతరగతి వఱకు "ఆదర్శ పాఠశాల" అనే పేరుతో అంతర్భాగము గలిగివుంటూ వుండిన విద్యాసంస్థ. ఏమా అంటే ఎనిమిదవ తరగతి నాలుగుగదులు, తొమ్మిది మూడు గదులు, పది మూడు గదులు ఆబరించుకొని వుండేవి, అన్ని గదులున్నాయా అని ఆశ్చర్యపోతున్నారు లాగుంది పాఠకులు. ఆశ్చర్య పోనక్కరలేదు. నిజంగా వుండేవి. ఉండడంలోను "పక్కాబిల్డింగు" కు సంబంధించిన గదులవి. రాతిగోడలు, రంపానకు తెగని దూలాలు! అన్నింటికంటే అతివిచిత్రం పెద్దమేడ! మేడ ఎక్కడానికి దుక్కల్లాంటి మెట్లు! నాటికీ నేటికీ